

హిందూపురంలోని కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లపై దిశానిర్దేశం చేస్తున్న ఎన్నికల పరిశీలకులు, కలెక్టర్

ప్రాంతం	పుట్టపర్తి	కదిరి	ధర్మవరం	హిందూపురం	పెనుకొండ
గరిష్ఠం కనిష్ఠం	36.0 24.0	36.0 24.0	36.0 25.0	34.0 23.0	33.0 23.0

8 గంటలకే లెక్కింపు ప్రారంభం

ఏర్పాట్లు పూర్తి

నియోజకవర్గానికి 14 టేబుళ్లు

భారీ భద్రతా చర్యలు

144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమలు

ఆరుగురు అబ్జర్వర్లు



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన టేబుళ్లు

రేపే కౌంటింగ్

పుట్టపర్తి/హిందూపురం, జూన్ 2: ఎన్నికల ప్రక్రియలో ఆఖరి ఘట్టమైన ఓట్ల లెక్కింపు ఈనెల 4వ తేదీన చేపట్టనున్నారు. దీంతో ఎన్నికల రణరంగంలో గెలిచేదెవరని ఉత్కంఠకు తెరపడనుంది. ఓటర్ల తీర్పు ఎవరి వైపు ఉంటుందో మరికొన్ని గంటల్లో తేలనుంది. ఏ నియోజకవర్గంలో ఏ అభ్యర్థి గెలుస్తారో, ఎవరు చతికిలపడతారో మంగళవారం మధ్యాహ్నాం తేటతెల్లం కానుంది. ఎన్నడూలేని టెన్షన్ తాజా ఎన్నికల ఫలితాలపై నెలకొంది. పలు నియోజకవర్గాల్లో నెగ్గేదెవరని అందరూ ఎదురు చూస్తున్నారు. తామే గెలవాలని అభ్యర్థులు ఇష్టదైవాలను ప్రార్థించుకుంటున్నారు. ఓట్ల లెక్కింపునకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. పొరబాట్లకు తావులేకుండా లెక్కింపు ప్రక్రియ సజావుగా సాగేలా సర్వం సిద్ధం చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభం కానుంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. 8.30 నుంచి ఈవీఎంల ఫలితాలు వెలువడనున్నాయి. జిల్లాలో హిందూపురం, పెనుకొండ, మడకశిర, కదిరి నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు బిట్ కళాశాలలో, ధర్మవరం, పుట్టపర్తి ఓట్ల లెక్కింపు లేపాక్షి మండలం టోల్‌గేట్ వద్దగల గురుకుల పాఠశాలలో నిర్వహించనున్నారు. దీంతో జిల్లా మొత్తం హిందూపురంవైపే చూస్తోంది.

శరవేగంగా ఏర్పాట్లు

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ గతనెల 13న జరిగింది. ప్రజాతీర్పు ఈవీఎం బాక్సుల్లో నిక్షిప్తం అయింది. వాటి లెక్కింపు మంగళవారం చేపట్టనున్నారు. ఉదయం 8గంటలకే పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రారంభంకానుంది. ఈసారి పోస్టల్ బ్యాలెట్ ఎక్కువగా ఉండటంతో ఆ ప్రక్రియ కొనసాగుతూ ఉండగానే ఈవీఎంల ఓట్ల కౌంటింగ్ కూడా ప్రారంభిస్తారు. మొదట ఈవీఎం రౌండ్ ఫలితాలే వెలువడనున్నాయి.

భారీ భద్రత

కౌంటింగ్‌కేంద్రాల వద్ద భారీ బందోబస్తు కొనసాగుతోంది. కేంద్ర బలగాలతోపాటు, సివిల్, ఏఆర్, పోలీసులు వేలసంఖ్యలో బందోబస్తు నిర్వహిస్తున్నారు. కౌంటింగ్ కేంద్రాలనుంచి రెండు కిలోమీటర్ల పరిధిలో రెడ్‌జోన్ ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాలతోపాటు జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమలులో ఉంది. కౌంటింగ్ పాసులు లేనివారికి దరిదాపులకు కూడా అనుమతిలేదు. ఓట్ల లెక్కింపునకు సంబంధించి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్ల ఏర్పాటు చేశారు. అభ్యర్థికి సంబంధించి 14 మంది ఏజెంట్లు కౌంటింగ్‌లో పాల్గొనవచ్చు. వీరికి పాసులు ఇస్తారు. పాసులు లేనివారికి కౌంటింగ్‌హాల్‌లోకి అనుమతి లేదు. కౌంటింగ్‌కు 827 మంది సిబ్బందిని నియమించారు. వీరికి ఓట్ల లెక్కింపుపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఓట్ల లెక్కింపు సరళి పరిశీలకులుగా ఆరుగురిని నియమించారు.

హిందూపురం అసెంబ్లీ కౌంటింగ్ కేంద్రం



ఓట్ల లెక్కింపు సాగేదిలా..

అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్ల ఏర్పాటు చేశారు. ప్రతిరౌండ్‌కు 14 పోలింగ్‌కేంద్రాల ఓట్ల లెక్కింపు చేపడతారు. ఒక్కోరౌండ్‌కు అరగంట వరకు సమయం పట్టే అవకాశం ఉంది. పుట్టపర్తి, మడకశిర నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు 18 రౌండ్లలో పూర్తికానుంది. హిందూపురం, పెనుకొండ 19 రౌండ్లలో ముగియనుంది. ఆఖరున ధర్మవరం కదిరి ఓట్ల లెక్కింపు 21 రౌండ్లలో పూర్తికానుంది. మొదటి ఫలితం జిల్లా కేంద్రం పుట్టపర్తిదే కానుంది.

ట్రాఫిక్ మళ్లింపు

ఓట్ల లెక్కింపు బిట్ కళాశాలలో చేపడుతున్న నేపథ్యంలో హిందూపురం నుంచి గోరంట్లకు వెళ్లే రహదారిలో ట్రాఫిక్ మళ్లింపునకు చర్యలు చేపడుతున్నారు. మంగళవారం ఉదయం నుంచే హిందూపురం నుంచి గోరంట్లకు వెళ్లే వాహనాలు కొట్నూరు వద్ద బైపాస్ రోడ్డు మీదుగా చిలమత్తూరు వైపు వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. గోరంట్ల వైపు నుంచి వచ్చే వాహనాలు పాలసముద్రం క్రాస్ నుంచి కొడికొండ చెక్‌పోస్టు మీదుగా మళ్లించనున్నారు. కౌంటింగ్ కేంద్రాలకు వచ్చే నాయకులు, అధికారుల వాహనాలు పార్క్ చేయడానికి బిట్ కళాశాలకు కొంతదూరంలో స్థలం ఏర్పాటు చేశారు. లేపాక్షి మండలంలోని టోల్‌గేట్ వద్ద ధర్మవరం, పుట్టపర్తి నుంచి వచ్చే వాహనాలకు పార్కింగ్ స్థలం సిద్ధం చేశారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టండి

పొరపాట్లకు తావివ్వద్దు

కచ్చితమైన ఫలితాలు వెల్లడించండి

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి దిశానిర్దేశం

పుట్టపర్తి, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా దిశానిర్దేశం చేశారు. అమరావతి నుంచి ఆయన జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు స్థానిక తన క్యాంపు కార్యాలయం నుంచి హాజరయ్యారు. ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ.. కౌంటింగ్ సందర్భంగా పొరబాట్లకు తావివ్వొద్దన్నారు. కచ్చితమైన ఫలితాలు వెల్లడించాలన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆయనకు వివరించారు. అన్ని భద్రతా చర్యలు తీసుకున్నట్లు తెలియజేశారు. జిల్లాలోకి కౌంటింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు.

కౌంటింగ్ ప్రాంతంలో నాలుగంచెల భద్రత



డ్రోన్, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

జిల్లా ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి రూరల్, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల వద్ద కేంద్ర, రాష్ట్ర సాయుధ బలగాలతో నాలుగంచెల భద్రత కల్పిస్తున్నట్లు జిల్లా ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఎస్పీ మాట్లాడుతూ.. ఇద్దరు ఎస్పీలు, ముగ్గురు ఏఎస్పీలు, 10 మంది డీఎస్పీలు, 42 మంది సీఐలు, 68 మంది ఎస్ఐలు, 326 మంది ఏఎస్ఐలు, 500 మంది పోలీసులు, 300 మంది హోంగార్డులు, 60 మంది మహిళా పోలీసులు, 120 మంది ఏఆర్, 80 మంది ఏపీఎస్పీ పోలీసులు, 110 క్యూఆర్టీ టీంలు, కేంద్రసాయిధ బలగాలు, గ్రేహౌండ్స్ బలగాలతో భద్రతా చర్యలు చేపడుతున్నామన్నారు. డ్రోన్, సీసీ కెమెరాలతో నిరంతరాయంగా పర్యవేక్షిస్తామన్నారు. కౌంటింగ్ కేంద్రాలైన లేపాక్షి గురుకుల పాఠశాల, హిందూపురం బిట్స్ కళాశాలలోకి వెళ్లి వచ్చేందుకు ఎంట్రీ ఎగ్జిట్ మినహా ఇతర మార్గాలేవి లేకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీసుయాక్ట్ అమలులో ఉంటాయన్నారు. కౌంటింగ్ అనంతరం సాయంత్రం 6 గంటల వరకు ఎన్నికల నిబంధనలు అమలులో ఉంటాయని ఆయన వెల్లడించారు. విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదన్నారు. అనుమతులు లేకుండా ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. జిల్లాలో ఏచిన్న ఘటన జరిగినా సీసీ కెమెరాల్లో నిక్షిప్తమై ఉంటుందనీ, తదనుగుణంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అల్లర్లు, గొడవలు సృష్టించినా, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టినా తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రశాంత కౌంటింగ్‌కు ప్రజలు సహకరించాలని ఎస్పీ కోరారు.

కూటమిలో జోష్

ఎగ్జిట్ పోల్స్‌తో ఆనందం

పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం..

అభ్యర్థులకు భద్రత పెంపు..

ఇళ్ల వద్ద సందడి..



పుట్టపర్తి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు ఒక రోజు ఉంది. అప్పుడే టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిలో జోష్ కనిపిస్తోంది. ఈనెల 1న ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు అనుకూలంగా రావడంతో కూటమి శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. దీంతో కౌంటింగ్‌కు సన్నాహకాలు చేసుకుంటున్నారు. ఇప్పటికే అభ్యర్థుల ఇళ్లు సందడిగా మారాయి. కార్యకర్తలు, నాయకులు తాకిడి పెరిగింది. అభ్యర్థులకు భద్రత కూడా పెంచారు. ఈ పరిణామంతో తమ విజయం నిశ్చయమైపోయిందని కూటమి వర్గాలు పేర్కొంటున్నాయి. పోలింగ్ రోజు వరకు వైసీపీ ధీమాగా ఉండేది. పోలింగ్ సరళిని చూశాక ఆ పార్టీ వర్గాలను నిరుత్సాహం ఆవహిస్తూ వచ్చింది. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలతో పూర్తిగా డీలాపడ్డారు.



జిల్లాలో హిందూపురం పార్లమెంటులోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ కూటమి, వైసీపీ మధ్య ఉత్కంఠ పోరు సాగింది. గెలుపుపై కూటమితోపాటు వైసీపీ ధీమా వ్యక్తం చేశాయి. మెజార్టీ ఎగ్జిట్ పోల్స్‌లో టీడీపీ కూటమికి అధికారం చేపట్టే అవకాశం ఉన్నట్లు సర్వేలు తేల్చాయి. దీంతో కౌంటింగ్‌కు కూటమి శ్రేణులు ఉత్సాహంగా సిద్ధమవుతున్నాయి. ఎగ్జిట్ పోల్స్‌తో డీలాపడిన వైసీపీని ఫలితం వెల్లడక ముందే నిరాశ వెంటాడుతోంది. మరికొన్ని గంటల్లో కౌంటింగ్ ప్రక్రియ మొదలవుతున్న నేపథ్యంలో ఉత్కంఠకు తెరపడనుంది. కూటమి అభ్యర్థులతోపాటు ఏజెంట్లు కౌంటింగ్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నారు. కూటమివైపే ఎగ్జిట్ పోల్స్ మొగ్గుచూపడంతో అభ్యర్థులకు భద్రత కూడా పెంచారు.

అందరి చూపు కూటమివైపే..

ఎగ్జిట్‌పోల్స్ కూటమిదే విజయమని తేల్చేయడంతో అందరి దృష్టి అటువైపే పడింది. ఇప్పటికే జిల్లాలో ఏ అభ్యర్థి గెలుస్తారు, రాష్ట్రంలో ఏపార్టీ అధికారంలోకి వస్తుంది? ప్రముఖుల మెజార్టీ ఎంత అనే విషయాలతో బెట్టింగ్ జోరుగా సాగుతోంది. కోట్ల రూపాయలు చేతులు మారాయి. ఒకటికి రెండు అంటూ బెట్టింగ్ జరిగిన సంగతి తెలిసిందే. జిల్లాలో అత్యధికంగా హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణపైనే ఎక్కువ బెట్టింగ్ జరగ్గా.. రాప్తాడు, పుట్టపర్తి, పెనుకొండ, కదిరి నియోజకవర్గాల్లో రెండో వరుసలో బెట్టింగ్‌లు సాగుతున్నాయి. అందరి అంచనాలు తల్లకిందలవుతూ మెజార్టీ ఎగ్జిట్‌పోల్స్ కూటమివైపే చెప్పడంతో బెట్టింగ్ రాయుళ్లలో ఆందోళన మొదలైంది. ప్రధానంగా వైసీపీ తరఫున బెట్టింగ్ వేసినవారు ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు చూసి టెన్షన్‌కి లోనవుతున్నారు. పోలింగ్ తరువాత రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అల్లర్లు, ఘర్షణలు తలెత్తిన నేపథ్యంలో ఎన్నికల సంఘంతోపాటు పోలీసు యంత్రాంగం ఎన్నడూలేని విధంగా గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేసింది. కౌంటింగ్ కేంద్రాల వద్ద నాలుగంచెల భద్రత ఏర్పాటు చేశారు. కూటమి వైపు ఎగ్జిట్ పోల్స్ మొగ్గుచూపడంతో కూటమి అభ్యర్థులకు భద్రత పెంచేశారు. గెలుపు జోష్‌తో కౌంటింగ్ కేంద్రాల్లోకి వెళ్లేందుకు అభ్యర్థులు, ఏజెంట్లు సిద్ధమవుతున్నారు.

కూటమిదే అధికారమంటూ జోరుగా పందేలు

సార్వత్రిక ఎన్నికల బెట్టింగ్ వన్‌సైడ్ అయిపోయింది. కూటమిదే అధికారం అంటూ అందరూ పందేలు వేసేందుకు సై అంటున్నారు. ఆఖరుకు వైసీపీ నాయకులు కూడా ముందుకొస్తున్నారు. దీంతో కూటమి గెలుపుపై బెట్టింగ్ వేసేందుకు పోటీ పడుతున్నారు. వైసీపీ తరఫున మాత్రం ఎవరూ ముందుకు రావట్లేదు. రూ.లక్షకి రూ.2 లక్షలు ఇస్తామన్నా.. ఎవ్వరూ ఆసక్తి చూపట్లేదు. ఇదివరకే వైసీపీ గెలుస్తుందన్న బెట్టింగ్ వేసినవారు ప్రస్తుతం దిక్కులు చూస్తున్నారు. తమ సొమ్ము పోవడం ఖాయమని ఆందోళన చెందుతున్నారు. దానిని రాబట్టుకునేందుకు రివర్స్ బెట్టింగ్‌కు దిగుతున్నారు. ఆ మేరకు టీడీపీ విజయంపై పందేలు వేస్తున్నారు. - ధర్మవరం



వైసీపీ నాయకులు సైతం అదేబాట..

అధికార పార్టీ తరఫున బెట్టింగ్‌కు ససేమిరా

ఇప్పటికే వేసిన వారిలో ఆందోళన

ఆ సొమ్ము రాబట్టుకునేందుకు రివర్స్ పందేలు

బెట్టింగ్ వన్‌సైడే..!

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. కౌంటింగ్ దగ్గరపడే కొద్దీ అందరిలో టెన్షన్ పెరుగుతోంది. పోలింగ్ జరిగి 18 రోజులు గడిచింది. ఓటింగ్ సరళిపై అన్నిపార్టీలవారు అంచనాలు వేసుకుంటూ వచ్చారు. గెలుపు తమదేనంటూ కూటమి, వైసీపీ వర్గాలు చెప్పుకుంటూ వచ్చాయి. గత నెలలో పోలింగ్ రోజువరకు వైసీపీ వర్గాల్లో ధీమా కనిపించింది. రూ.కోట్లలో బెట్టింగ్‌లు వేశారు. పోలింగ్ సాగిన తీరుతో అంతా తల్లకిందులైంది. ఎండ, వానను సైతం లెక్కచేయకుండా ఓటర్లు క్యూకట్టారు. పోస్టల్ బ్యాలెట్‌ను ఎన్నడూలేనంతగా వినియోగించుకున్నారు. ఇవన్నీ తమకే అనుకూలమని కూటమి వర్గీయులు ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ మాత్రం పథకాలపైనే ఆశలు పెట్టుకుంది. అధికార పార్టీ వర్గాలు రోజురోజుకీ డీలాపడుతూ వచ్చాయి. ఆఖరుకు వైసీపీ గెలుపుపై బెట్టింగ్ వేసేందుకు కూడా ఎవరూ ముందుకు రాలేని పరిస్థితి ఏర్పడింది. కూటమి గెలిస్తే రూ.లక్ష, వైసీపీ విజయం సాధిస్తే రూ.2 లక్షలు ఇస్తామన్నా.. ఎవ్వరూ ఆసక్తి చూపలేదు.

ఎగ్జిట్ పోల్స్‌తో వన్‌సైడ్

సార్వత్రిక ఎన్నికలపై ఈనెల 1న వెలువడిన ఎగ్జిట్ పోల్స్‌తో అంతా ఏకపక్షంగా మారింది. ఎగ్జిట్ పోల్స్ కూటమికే పట్టం కట్టడంతో ఆ వర్గాల్లో జోష్ పెరిగింది. బెట్టింగ్‌కు సై అంటున్నారు. వైసీపీ తరఫున పందెంవేసేవారే కరువయ్యారు. అధికార పార్టీ నాయకులు కూడా.. కూటమి గెలుస్తుందంటూ బెట్టింగ్ వేస్తున్నారు. ఇదివరకే వైసీపీ గెలుస్తుందంటూ పందేలు వేసినవారు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. తమ డబ్బు పోయినట్లేనన్న ఆందోళన వారిని వెంటాడుతోంది. ఆ డబ్బు రాబట్టుకునే ప్రయత్నాలు చేపట్టారు. కూటమి గెలుస్తుందంటూ బెట్టింగ్‌లకు దిగుతున్నారు. తద్వారా వైసీపీపై వేసిన పందెం సొమ్ము రాబట్టుకోవాలని భావిస్తున్నారు. వైసీపీ విజయంపై బెట్టింగ్ వేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో దిక్కులు చూస్తున్నారు. హిందూపురం పట్టణంలో ఇద్దరు వ్యక్తుల మధ్య బెట్టింగ్‌కు ఓ మధ్యవర్తి ఒప్పందం కుదిర్చినట్లు తెలిసింది. కూటమి గెలిస్తే రూ.లక్ష, వైసీపీ విజయం సాధిస్తే రూ.1.30 లక్షలు ఇచ్చేలా అంగీకారం కుదిరినట్లు తెలిసింది. డబ్బు మధ్యవర్తికి అప్పజెప్పే సమయానికి ఇరువురూ కూటమి గెలుపుపైనే పందెం వేస్తామన్నారట. దీంతో మధ్యవర్తి అవాక్కయ్యాడని సమాచారం. అలా.. ఆ బెట్టింగ్ ప్రయత్నం బెడిసికొట్టింది. ఆవేదనలో ఉన్నారు.



మందుబాబులకు కష్టాలు

ముదిగుబ్బ, జూన్ 2: ఎన్నికల కౌటింగ్ నేపథ్యంలో మద్యం షాపులు మూతపడనున్నాయి. ఇది మందుబాబులకు సమస్యను తెచ్చిపెట్టింది. ఆదివారం మద్యం దక్కించుకునేందుకు షాపుల వద్ద క్యూ కట్టారు. ఉదయం నుంచే లైన్‌లో కనిపించారు. చాంతాడంత క్యూలు కనిపించాయి. మద్యం దుకాణాల్లో శనివారానికే బ్రాండెడ్ మద్యం ఖాళీ అయింది. చీప్ లిక్కర్‌నే అంటగడుతున్నారంటూ మందుబాబులు విమర్శిస్తున్నారు. ఇచ్చింది తీసుకోవడం తప్ప.. వేరే మార్గంలేదు. అదికూడా దొరికే పరిస్థితి కనిపించట్లేదు. క్యూలో నిలబడలే, ఆ ఇబ్బందులు పడలేక చాలామంది బ్లాక్‌లో కొంటున్నారు. బెల్టుషాపులను ఆశ్రయిస్తున్నారు. అధిక ధరలతో కొంటూ జేబులకు చిల్లులు పెట్టుకుంటున్నారు.



ముదిగుబ్బలోని మద్యం షాపు వద్ద గుమిగూడిన మందుబాబులు

ఏజెంటన్నో..! భద్రం

- బ్రీత్ ఎనలైజర్లతో పోలీసులు సిద్ధం
- మందుకొడితే కౌంటింగ్ కేంద్రంలోకి నో ఎంట్రీ
- కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత
- ఐడీ కార్డు ఉంటేనే అనుమతి
- ఏజెంట్లకు శిక్షణలో ఇరుపార్టీల అభ్యర్థులు నిమగ్నం



అనంతపురం జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లాలో చోటు చేసుకున్న కొన్ని పరిణామాల నేపథ్యంలో కౌంటింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారులు, పోలీసు యంత్రాంగం సిద్ధమైంది. ఆ మేరకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ గౌతమిశాలి పూర్తి స్థాయిలో నిమగ్నమయ్యారు. కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘట నలకు తావులేకుండా ముడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి ఎన్నికల అధికారులు జారీ చేసిన ఐడీ కార్డులు, పాస్‌లు ఉన్న వారిని మాత్రమే అనుమతించేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయం లో ఏ ఒక్క అధికారి అలసత్వం వహించినా ఆయా అధికారులపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని ఇప్పటికే కలెక్టర్, ఎస్పీలు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు.

ఏజెంటే కీలకం...

కౌంటింగ్ ప్రక్రియలో ఏజెంట్లే కీలకం. ఈ నేపథ్యంలో అటు కూటమి, ఇటు అధికార వైసీపీ అభ్యర్థులు కౌంటింగ్ కేంద్రాల్లో అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు పార్టీకి విధేయులుగా ఉన్న వారిని ఇప్పటికే కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించారు. ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్, ఎస్పీలు కౌంటింగ్ కేంద్రాల్లో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులు వారి వారి ఏజెంట్లకు మూడు రోజులుగా శిక్షణనిచ్చే పనిలో నిమగ్నమయ్యారు. ఆదివారం సైతం ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులు ఏజెంట్లకు శిక్షణనిచ్చే పనిలోనే ఉన్నారు. ఎక్కడా ఏమరుపాటుకు తావులేకుండా... చర్చలకు తావివ్వకుండా జాగ్రత్తగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకతను ఆయా పార్టీల అభ్యర్థులు వారి వారి ఏజెంట్లకు వివరించడం గమనార్హం.



జేఎన్‌టీయూలో కౌటింగ్‌కు సిద్ధం చేసిన హాలు

మద్యం తాగితే బయటికే..!

జిల్లాలోని 8 నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ప్రక్రియను జేఎన్‌టీయూలో నిర్వహించనున్నారు. ఏజెంట్ పాస్ ఉంటే కౌంటింగ్ కేంద్రాల్లోకి గతంలో నేరుగా అనుమతించేవారు. అయితే ఈ సారి క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే కౌంటింగ్ కేంద్రాల్లోకి ఏజెంట్లను పంపాలనే స్పష్టమైన నిర్ణయానికి వచ్చారు. ముఖ్యంగా ఎవరైనా మద్యం తాగి కౌంటింగ్ కేంద్రాల్లో ఏజెంట్లుగా వెళ్లేందుకు ప్రయత్నిస్తే బయటకు పంపనున్నారు. ఇందుకోసం కౌంటింగ్ కేంద్రాల ప్రధాన ద్వారం వద్ద బ్రీత్ ఎనలైజర్లతో పోలీసులను నియమించారు. వారు పరీక్షలు చేసిన తర్వాతనే ఏజెంట్లను లోనికిఅనుమతిం చేలా ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడే ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులకు భయం పట్టుకుంది. మంగళవారం ఉదయం ఉదయం 6 గంటలకే ఆయా పోలింగ్ ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంది. ఎవరైనా సోమవారం రాత్రి మద్యం తాగిఉంటే... ఆ ప్రభావం 12 గంటలపాటు ఉంటుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఈ విషయంలోనే ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులు తర్జనభర్జన పడుతున్నారు. ఆ మేరకు ఏజెంట్లకు దిశానిర్దేశం చేస్తున్నారు.

కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించిన

కేంద్ర బృందం

అనంతపురం టౌన్, జూన్ 2: జిల్లాలో కౌంటింగ్ ఏర్పాట్లను కేంద్ర పరిశీలకులు పరిశీలించారు. ఆదివారం పరిశీలకులు మనీష్‌సింగ్, అజయ్‌నాథ్, అజయ్‌కుమార్ జిల్లాకు చేరుకున్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ గౌతమిశాలితో కౌంటింగ్ ఏర్పాట్లపై ఆరాతీశారు. అనంతరం జేఎన్‌టీయూకు వెళ్లి ఏర్పాట్లు, భద్రతా చర్యలను పరిశీలించారు, అక్కడనుంచి కలెక్టరేట్‌కు చేరుకొని కమాన్ కంట్రోల్‌రూంను పరిశీలించారు. ఆ తర్వాత ఎన్ఐసీ సెంటర్‌కు వెళ్లి వారి సమక్షంలోనే ఎన్నికల కౌంటింగ్‌కు నియమించిన 1376మంది సిబ్బందికి ర్యాండమైజేషన్ చేపట్టి డ్యూటీలు కేటాయించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ నిదియా, అసిస్టెంట్ కలెక్టరు వినూత్న తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ నిర్వహిస్తున్న కేంద్ర పరిశీలకులు

జేఎన్‌టీయూ పరిసరాల్లో

ట్రాఫిక్ మళ్లింపు



అనంతపురం క్రైం, జూన్ 2: కౌంటింగ్ నేపథ్యంలో సోమ, మంగళవారాల్లో జేఎన్‌టీయూ పరిసరాల్లో ట్రాఫిక్ మళ్లించామని ఎస్పీ గౌతమిశాలి అన్నారు. సూచించిన ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణించి పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వివరాలను వెల్లడించారు.

- థామస్‌మన్రో సర్కిల్ నుంచి జేఎన్‌టీయూ రోడ్డుకు ఎడమ వైపున్న ఫెర్రర్‌నగర్ 9వ క్రాస్‌లో నివశిస్తున్న వారు, శారదానగర్ 6 క్రాస్‌లు, ఎల్ఐసీ కాలనీ 4 క్రాస్‌లు, కె.మల్లప్ప కాలనీ 2 క్రాస్‌లు, విద్యానగర్ 2 క్రాస్‌లలో నివశిస్తున్న ప్రజలు, సుశీల్ రెడ్డి కాలనీవాసుల వారి వాహనాల రాకపోకలు జేఎన్‌టీయూ రోడ్డు వైపునకు అనుమతి లేనందున ప్రత్యామ్నాయ మార్గమైన అనంతపురం-కదిరి రోడ్డు మీదుగా నగరంలోకి వెళ్లాలి.
- థామస్ మన్రో సర్కిల్ నుంచి హిందూస్మశాన వాటిక దాటిన తరువాత జేఎన్‌టీయూ వరకు రోడ్డుకు కుడివైపున ఉన్న ఎస్‌బీఐ కాలనీలోని 3 క్రాస్‌ల వారు రాకపోకలు ప్రత్యామ్నాయ మార్గమైన హౌసింగ్‌బోర్డు నుంచి ఆర్టీఓ ఆఫీస్‌కు వెళ్లేలా రోడ్డు మీదుగా నగరంలోకి వెళ్లాలి.
- హౌసింగ్‌బోర్డు 80 ఫీట్ రోడ్డు, పరిసర ప్రాంతాల ప్రజలు కూడా వారి రాకపోకలు విద్యుత్‌నగర్, అశోక్‌నగర్ మీదుగా కొనసాగించాలి.
- రాప్తాడు, ప్రసన్నాయపల్లి, ఇందిరమ్మకాలనీ, చిన్మయనగర్‌కు చెందిన ప్రజలు రాకపోకలు జేఎన్టీయూ వైపు వచ్చేందుకు అనుమతి లేనందున అనంతపురం-కదిరి రోడ్డు మీదుగాగాని లేదా ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ నుంచి నాయక్‌నగర్ మీదుగా నగరంలోకి వెళ్లాలి.
- భైరవ్‌నగర్ 2వక్రాస్ నుంచి 17వ క్రాస్ వరకు ఉన్నవారు భైరవనగర్ 9వరోడ్డు మార్గం ద్వారా ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ నుంచి నాయక్‌నగర్ వైపు వెళ్లే రోడ్డు ద్వారా నగరంలోకి వెళ్లాలి.
- రాప్తాడు, ప్రసన్నాయపల్లి ప్రజలు అనంతపురం-కదిరి రోడ్డు లేదా ప్రసన్నాయపల్లి రైల్వేగేట్ నుంచి నాయక్‌నగర్ మీదుగా వెళ్లాలి.

వాహనాల పార్కింగ్ ఇలా..

అనంతపురం పార్లమెంటు, జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు, ఏజెంట్లకు సంబంధించిన వాహనాల పార్కింగ్ కోసం ఎస్పీ పలు సూచనలు చేశారు.

- రాప్తాడు, అనంతపురం నియోజకవర్గాల వారీగా పోటీ చేసిన అభ్యర్థులు మాత్రమే మొదటి గేట్(సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సర్కిల్‌లోని గేట్)ద్వారా లోపలికి వెళ్లటానికి అనుమతి ఉంటుంది. వారి వాహనాలను జేఎన్‌టీయూ ఆడిటోరియం పక్కనున్న స్థలంలో పార్కింగ్ చేసుకోవాలి.
- తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం నియోజకవర్గాల వారీగా పోటీ చేసిన అభ్యర్థులు మూడో గేట్(మెయిన్ గేట్)ద్వారా లోపలికి వెళ్లటానికి అనుమతి ఉంటుంది. వారి వాహనాలను జేఎన్‌టీయూ మెయిన్ బిల్డింగ్ ముందున్న ఖాళీ స్థలంలో పార్కింగ్ చేసుకోవాలి.
- అనంతపురం పార్లమెంటు, జిల్లాలోని రాప్తాడు, అనంతపురం, శింగనమల, కళ్యాణదుర్గం, ఉరవకొండ, తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం నియోజకవర్గాల నుంచి పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లు వారి వాహనాలను జేఎన్‌టీయూ ప్రాంగణం దాటిన తరువాత పక్కనే ఉన్న పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్‌లో పార్కింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లో వారి వాహనాలకు జేఎన్‌టీయూ కళాశాల లోపలికి వెళ్లేందుకు అనుమతి లేదు.

ఏమవుతుందో ఏమో ..!

- తాడిపత్రి ఫలితంపై ఉత్కంఠ
- అవాంఛనీయ ఘటనలతో ఆందోళన
- గెలుపు ఎవరిదైనా అల్లర్లు తప్పవా?
- రేపు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

తాడిపత్రిటౌన్, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల ఓట్ల కౌంటింగ్ సమయం దగ్గర పడుతుండటంతో తాడిపత్రి నియోజకవర్గంలో ఉత్కంఠ పెరిగిపోతోంది. పోటీ చేసిన అభ్యర్థుల భవితవ్యం మంగళవారం తేలనుంది. ఈ నేపథ్యంలో ఏమైనా గొడవలు జరుగుతాయేమోననే ఆందోళన నియోజకవర్గ ప్రజల్లో వ్యక్తం అవుతోంది. పోలింగ్ సందర్భంగా దాడులు, ప్రతిదాడులు జరగడంతో ఒకింత ఆందోళనకర పరిస్థితులు నియోజకవర్గంలో నెలకొన్న విషయం విదితమే. ప్రధాన పార్టీల అభ్యర్థులు నువ్వా, నేనా అన్నట్లు పోటీ పడటంతో ఇక్కడి ఫలితంపై అభ్యర్థులతోపాటు ప్రజల్లో కూడా ఉత్కంఠ నెలకొంది.

సర్వత్రా హైటెన్షన్

రాష్ట్రమంతా తాడిపత్రి ఫలితం వైపే చూస్తోంది. అందుకు ప్రధాన కారణం మూడేళ్ల కిందట జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రమంతా ఫ్యాన్ హవా చూపినా తాడిపత్రిలో మాత్రం సైకిల్ జోరు చూపించింది. దీంతో ప్రస్తుత అసెంబ్లీ ఫలితంపై అభ్యర్థులతోపాటు అందరిలో ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే ఈ ఫలితంపై జోరుగా పందేలు కాసినట్లు సమాచారం.

గొడవలు, అల్లర్లు తప్పవా..?

కొన్నేళ్లుగా ప్రశాంతంగా ఉన్న తాడిపత్రిలో వైసీపీ అల్లరిమూకలు సృష్టించిన దాడుల వల్ల పట్టణ ప్రజలు భీతిల్లారు. ఎన్నికలు జరిగిన మరుసటిరోజే ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ మూకలు టీడీపీ సీనియర్ నాయకుడు సూర్యముని ఇంటిపై రాళ్లదాడి చేశారు. ఈక్రమంలో మరోసారి వైసీపీ అధికారంలోకి వస్తే పరిస్థితి ఏంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రశాంతత నెలకొల్పితే బాగుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఎక్కడ చూసినా పోలీసు బలగాలే..

పోలింగ్ సందర్భంగా జరిగిన గొడవల నేపథ్యంలో పట్టణంలో ఎక్కడచూసినా పోలీసు బలగాలే కనిపిస్తున్నాయి. బందోబస్తుకు దాదాపు 500మంది సిబ్బందిని నియమించారు. వీరిలో ఇద్దరు డీఎస్పీలు, ఏడుగురు సీఐలు, 15 మంది ఎస్ఐలు, 30 మంది ఏఎస్ఐలు, 200మంది సివిల్ పోలీసులు, 100 మంది ర్యాపిడ్‌ఫోర్స్ సిబ్బంది, 100మంది ఏపీఎస్పీ బెటాలియన్ సిబ్బందిఉన్నారు. ఎక్కడ ఏ చిన్న సమస్య తలెత్తినా వెంటనే స్పందించాలని అధికారులు ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. నిర్లక్ష్యంగా ఉండకుండా చురుకుగా పనిచేయాలని పోలీస్‌బాస్ స్థానిక పోలీసులను ఆదేశించినట్లు సమాచారం. అయితే కిందిస్థాయి సిబ్బంది మాత్రం విధుల్లో అలసత్వం వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పలు చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది సమీపంలోని చెట్ల వద్ద కుర్చీలు వేసుకొని నింపాదిగా కూర్చొవడమే కాకుండా సెల్‌ఫోన్లు చూసుకుంటూ కాలక్షేపం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

ద్వితీయశ్రేణి నాయకులను గుర్తించి ఉంటే..

గతంలో జరిగిన దాడులు, ఘర్షణలను దృష్టిలో ఉంచుకొని అజ్ఞాతంలో ఉన్న ఇరుపార్టీలకు చెందిన ద్వితీయశ్రేణి నాయకులను గుర్తించి ఉంటే బాగుండేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. రాళ్లదాడులు జరిగి 20రోజులు కావస్తున్నా పోలీసు అధికారులు ఈ దిశగా ఎందుకు దృష్టి సారించడం లేదో అంతుచిక్కని ప్రశ్నగా మారింది. ఏ పార్టీ గెలిచినా ఆ పార్టీకి చెందిన ద్వితీయశ్రేణి నాయకులు పట్టణానికి వస్తే ఆ రోజు పరిస్థితులు ఎలా ఉంటాయోనని ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వీరిని అదుపులోకి తీసుకొని ఉంటే పరిస్థితి చేయిదాటకుండా ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పెరుగుతున్న బైండోవర్, రౌడీషీట్లు

కేవలం జిల్లా ఉన్నతాధికారులకు చూపించడానికి అమాయకులను బలిపశువులను చేసి బైండోవర్, రౌడీషీట్‌లు ఓపెన్ చేస్తున్నట్లు పోలీసులపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దాడులతో సంబంధం లేనివారిని సైతం వరుసపెట్టి బైండోవర్‌లు చేస్తుండటంతో నియోజకవర్గ ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఈక్రమంలో వారి కుటుంబ సభ్యులు నిత్యం పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద పడిగాపులు కాస్తున్నారు. కనిపించిన అధికారులతో సార్.... మా వాడికి రాళ్లదాడులకు ఎలాంటి సంబంధం లేదు అని మొరపెట్టుకుంటున్నారు. ఇప్పటివరకు నియోజకవర్గ వ్యాప్తంగా 197మందిపై రౌడీషీట్, 200మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. వీరిలో దాడులకు సంబంధంలేని వారే ఎక్కువగా ఉన్నారన్న ప్రచారం ఉంది.



యల్లనూరు రోడ్డులో ఉన్న చెకింగ్ పాయింట్‌లో సెల్‌ఫోన్ చూస్తూ కాలక్షేపం చేస్తున్న కానిస్టేబుల్



జేసీపీఆర్ ఇంటివద్ద సెల్‌ఫోన్లు చూసుకుంటున్న పోలీసు సిబ్బంది

లాడ్జిలు, హోటళ్లలో విస్తృత తనిఖీలు

అనంతపురం క్రైం, జూన్ 2: జిల్లాలో మంగళవారం జరగనున్న కౌంటింగ్ నేపథ్యంలో ఎస్పీ గౌతమిశాలి ఆదేశాల మేరకు పోలీసులు లాడ్జిల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. అనుమానితులు, అపరిచితులు లాడ్జిల్లో బస చేసి కౌంటింగ్ ప్రక్రియ రోజు ఎలాంటి ఘటనలకు పాల్పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా తనిఖీలు చేపట్టారు. అనుమానితులకు ఎట్టి పరిస్థితుల్లోను లాడ్జిల్లో గదులు ఇవ్వకూడదని, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు. హోటళ్లలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం సేవించేందుకు అనుమతిస్తే చర్యలు చేపడతామన్నారు.

పెద్దపప్పూరు ఎస్ఐ సస్పెన్షన్



తాడిపత్రిటౌన్, జూన్ 2: పెద్దపప్పూరు మండల ఎస్ఐ శరత్ చంద్రను ఉన్నతాధికారులు ఆదివారం సస్పెండ్ చేశారు. తాడిపత్రి రాళ్లదాడి కేసులో నిందితుడిగా ఉన్న టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్‌నాయుడు పెద్దపప్పూరు మండలంలోని ముచ్చుకోట సమీప ప్రాంతాల్లో ఉన్నప్పటికీ కదలికలను పసిగట్టలేదని డ్యూటీలో అలసత్వం వహించాడన్న కారణంగా ఎస్ఐను సస్పెండ్ చేశారు.

రుతుపవనాలు వచ్చేశాయ్

జిల్లాను తాకిన నైరుతి

అనంతపురం అర్బన్, జూన్ 2: నైరుతి రుతుపవనాలు ఆదివారం సాయంత్రం అనంత జిల్లాను తాకాయి. ఈ ప్రభావంతో జిల్లాలో సోమవారం నుంచి మూడు రోజులపాటు తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షం పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అలాగే ఒకటి, రెండు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది. 30-40 కిమీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. గతేడాది జూన్ 8న జిల్లాలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. గతంలో పోలిస్తే... ఆరు రోజుల ముందుగానే జిల్లాలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. ఈ ఏడాది సాధారణ వర్షపాతం కంటే ఎక్కువగానే వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఇదే జరిగితే గత ఏడాదితో పోలిస్తే ఎక్కువ విస్తీర్ణంలోనే పంటలు సాగయ్యే అవకాశం ఉంది.

20 మండలాల్లో వర్షం

జిల్లాలోని 20 మండలాల్లో శనివారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా ఉరవకొండలో 52.6 మి.మీ వర్షపాతం నమోదైంది. కూడేరు 50.4, బెళుగుప్ప 49.8, రాయదుర్గం 35.6, వజ్రకరూరు 32.2, బొమ్మనహాళ్ 27.2, గుమ్మఘట్ట 25.8, కళ్యాణదుర్గం, కంబదూరు 24.2, ఆత్మకూరు 20.0, బ్రహ్మసముద్రం 18.2, కణేకల్లు 17.0, విడనపకల్లు, యాడికి 14.2, యల్లనూరు 12.6 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 8.2 మి.మీలోపు వర్షపాతం నమోదైంది.

శ్రీసత్యసాయి జిల్లాలో..

పుట్టపర్తి రూరల్: అత్యధికంగా కనగానపల్లిలో 54.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. చిలమత్తూరు 51.2, నంబులపూలకుంట 44.2, కొత్తచెరువు 42.2, గోరంట్ల 42.0, పెనుకొండ 40.0, రామగిరి 33.4, పుట్టపర్తి 29.8, కదిరి 27.2, గాండ్లపెంట 26.8, చెన్నేకొత్తపల్లి 22.6, నల్లచెరువు 22.4, అమడగూరు 21.6, బుక్కపట్నం 16.4, ఓబుళదేవరచెరువు 16.2, సోమందేపల్లి 15.4, హిందూపురం 14.8, పరిగి 14.2, నల్లమాడ 13.2, రొళ్ల 10.4, ధర్మవరం, తనకల్లు 9.6, మడకశిర 9.2, గుడిబండ 8.8, లేపాక్షి 8.2, రొద్దం 7.6 మిమీ, అమరాపురం 6.2 మిమీ, తాడిమర్రి 5.8, బత్తలపల్లి 3.4, అగళి 3.0, తలుపులలో 2.8 మి.మీ వర్షపాతం నమోదైందన్నారు.

పడిపోయిన విద్యుత్ స్తంభాలు

అనంతపురంరూరల్: ఈదురుగాలుల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. శనివారం రాత్రి వీచిన ఈదురుగాలకు కూడేరు, శింగనమల, చెన్నేకొత్తపల్లి ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. ఆయా ప్రాంతాల్లో 15విద్యుత్ స్తంభాలు పడిపోయినట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్ర తెలిపారు. దీంతో స్వల్ప నష్టం జరిగినట్లు వెల్లడించారు. ఇబ్బందులు తలెత్తిన ప్రాంతాల్లో లైన్లను మరమ్మతులు చేసి.. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు.

దెబ్బతిన్న పత్తి, మొక్కజొన్న పంటలు

బొమ్మనహాళ్: మండలంలో శనివారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అక్కడక్కడ మొక్కజొన్న, పత్తి పంటలు వర్షపునీటికి తడిసిపోయాయి. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షం కురవడం వల్ల వరద నీరు ఉద్దేహాళ్ హగరికి భారీగా వచ్చి చేరింది. కొళగానహళ్లి, కబాలివంకలు ఉధృతంగా ప్రవహించాయి. మండలంలో దేవగిరి, ఉద్దేహాళ్, శ్రీధరఘట్ట తదితర గ్రామాలలో భారీ వర్షం పడింది. 27.2 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.



బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ సమీపాన నీట మునిగిన పత్తిపంట



బొమ్మనహాళ్ మండలం లింగదహాళ్ వద్ద వర్షపునీటిలో మొక్కజొన్న పైరు

అనర్హులకు ఇన్‌చార్జి బాధ్యతలు

సమగ్రశిక్షలో అసిస్టెంట్ సెక్టోరియల్‌కు జీసీడీఓ బాధ్యతలు

నిబంధనలు గాలికి.. ఏపీసీ చర్యలు తీసుకునేరా...?

అనంతపురం విద్య, జూన్ 2: సమగ్రశిక్ష ప్రాజెక్టులో అనర్హులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అడ్మిషన్ల వేళ సెక్టోరియల్ కేడర్‌కు చెందిన అత్యంత కీలకమైన జీసీడీఓ పోస్టు అసిస్టెంట్ సెక్టోరియల్‌కు ఇన్‌చార్జిగా అప్పగించడంపై అనేక విమర్శలు వస్తున్నాయి. ఇప్పటి వరకు జీసీడీఓగా పనిచేస్తున్న మహేశ్వరి ఇటీవల చైల్డ్ కేర్ లీవ్ తీసుకున్నారు. గతనెల 30వ తేదీ నుంచి 13వ తేదీ వరకు సెలవుపై వెళ్లినట్లు సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారులు స్పష్టం చేశారు. అసిస్టెంట్ ఐఈడీగా పనిచేస్తున్న షమకు ఇన్‌చార్జి జీసీడీఓ బాధ్యతలు అప్పగించారు. కేజీబీవీల్లో వేలాది మంది విద్యార్థినులు చదువుకుంటుండగా, వందలాది మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 32 కేజీబీవీలను పర్యవేక్షించాల్సిన బాధ్యత జీసీడీఓగా పనిచేసే అధికారిదే. అందుకు మండల విద్యాశాఖాధికారి, ప్రధానోపాధ్యాయులు మాత్రమే అర్హులు. అసిస్టెంట్ ఐఈడీగా పనిచేస్తున్న షమా గతంలో పీజీటీగా పనిచేశారు. పీజీటీ పోస్టు స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు సమానం. ఎంఈఓ, హెచ్ఎం కాకపోయినా ఆమెకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం శోచనీయం. ఆమె అయిష్టంగా ఉన్నట్టు సమాచారం. జిల్లాలో మహిళా ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు లేరన్నట్టుగా అనర్హులకు అప్పగించడంపై అనేక విమర్శలు వస్తున్నాయి. గతంలో కూడా జీసీడీఓ పోస్టు భర్తీలో సమగ్రశిక్ష అధికారులు అనర్హులకు అవకాశం ఇచ్చారన్న ఆరోపణలు మూటగట్టుకున్నారు. జూన్ నుంచి ఆగస్టు వరకు అడ్మిషన్లు జరుగుతాయి. అత్యంత కీలకమైన సమయంలో అనర్హులకు జీసీడీఓ బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు వస్తున్నాయి. కొత్తగా నియమితులైన ఏపీసీ ఈ సమస్యకు ఎలా పరిష్కారం చూపుతారో చూడాలి.

విద్యుదాఘాతంతో రైతు మృతి

గుమ్మఘట్ట, జూన్ 2: మండలంలోని పైదొడ్డి గ్రామంలో ఆదివారం ఉదయం విద్యుదాఘాతంతో రైతు నాయకుల పాలయ్య(49) మృతి చెందాడు. పొలంలో వ్యవసాయ మోటార్ ఆన్ చేసేందుకు వెళ్లి స్టార్టర్ వద్ద కిందపడి మృతి చెందాడు. కొంత సమయానికి కుటుంబసభ్యులు అక్కడికెళ్లి చూడగా.. మోటార్‌కు అమర్చిన స్టార్టర్‌లో విద్యుత్‌షాక్‌కు గురైనట్లు గుర్తించి రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. గుమ్మఘట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.



పాలయ్య (ఫైల్)



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కుక్కల దాడిలో 23 గొర్రెలు మృతి

● బాధితుడికి కందికుంట పరామర్శ



గొర్రెల కళేబరాలను పరిశీలిస్తున్న కందికుంట వెంకటప్రసాద్

నంబులపూలకుంట, జూన్ 2: మండలంలోని సున్నంపుగుట్టతండాలో రవినాయక్‌కు చెందిన 23 గొర్రెలు కుక్కలదాడిలో మృతి చెందాయి. బాధితుడు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. శనివారం మధ్యరాత్రి సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడిందని, ఉరుముల శబ్ధానికి మందలోని పలు గొర్రెలు బయటకు వచ్చాయన్నారు. గమనించిన ఊరి కుక్కలు హఠాత్తుగా వాటిపై దాడి చేసి చంపేశాయన్నారు. ఆ సమయంలో విద్యుత్ లేదని, దీంతో గొర్రెలను కాపాడుకోలేక పోయామని కంటతడిపెట్టారు. ఇటీవల కూడా 20 గొర్రెలు వ్యాధుల బారినపడి మృతిచెందాయన్నారు. రూ.6లక్షలు అప్పు చేసి 110 గొర్రెలను కొనుగోలు చేశానని, వీటిలో ఇప్పటికి 43కుపైగా చనిపోయాయని వాపోయారు. మొత్తంమీద దాదాపు రూ. 3.5 లక్షల వరకు నష్టం జరిగిందని బాధపడ్డారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. విషయం తెలుసుకున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ ఆదివారం గ్రామానికెళ్లి బాధితుడిని పరామర్శించారు. సంఘటనపై వివరాలడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.20వేలు ఆర్థికసాయం అందించారు. పదిరోజుల తరువాత మరికొంత సాయం చేస్తామని హామీ ఇచ్చారు. కందికుంట వెంట మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ పోమేనాయక్, గ్రామస్థులు ఉన్నారు.

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

బత్తలపల్లి, జూన్2: ఎన్నికల కోడ్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. మండలకేంద్రంలో ఆదివారం ఆయన తన సిబ్బందితో కలిసి పర్యటించారు. అనుమానితుల ఇళ్లల్లో, ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులతో సమావేశమై మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉంటే శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. లేదా పోలీసుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. అందరూ ఐకమత్యంతో గ్రామ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఎవరైనా గ్రామ ప్రశాంతతకు విఘతం కలిగించినా, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవన్నారు.

విజయోత్సవ ర్యాలీలు చేయరాదు

తనకల్లు: మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులకు పోలీసులు ఆదివారం హెచ్చరికలు జారీ చేశారు. ఓట్లలెక్కింపు అనంతరం బాణసంచా పేల్చడం , విజయోత్సవ ర్యాలీలు చేయడం లాంటివి జరపరాదన్నారు. బాటిళ్లలో, క్యాన్లలో పెట్రోల్, డీజిల్ పట్టకూడదని పెట్రోల్ బంక్ యజమానులకు సూచించారు. ఎవరూనా నిబంధనలు అతిక్రమిస్తేకఠిన చర్యలు తీసుకుని, కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ ధరణిబాబు హెచ్చరించారు.

రైల్వేఅండర్ బ్రిడ్జి కింద వర్షపు నీరు నిల్వ

● ఇబ్బంది పడుతున్న వాహనదారులు



గాంధీనగర్ రైల్వేఅండర్ బ్రిడ్జి కింద నిలిచిన వర్షపు నీరు

ధర్మవరం, జూన్ 2: పట్టణంలోని గాంధీనగర్ రైల్వే అండర్ బ్రిడ్జి కింద నిల్వ ఉన్న వర్షపు నీటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. గత శనివారం రాత్రి కురిసిన వర్షానికి బ్రిడ్జి కింద వర్షపు నీరు పెద్దఎత్తున చేరింది. దీంతో కొత్తపేట నుంచి పట్టణంలోకి రాకపోకలు సాగించే పాదచారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటీవల రైల్వే అండర్ బ్రిడ్జి పనులను పూర్తీ చేశారు. అయితే బ్రిడ్జి కింద రోడ్డు పూర్తీస్థాయిలో వేయలేదు. దీంతో వర్షపు నీరంతా నిల్వ ఉంటోంది. సంబంధిత అధికారులు స్పందించి బ్రిడ్జికింద ఉన్న వర్షపు నీటిని తొలగించాలని, అలాగే నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అధ్వానంగా యోగివేమన జలాశయం రోడ్డు

●ఇరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్లు ● మూసుకుపోతున్న రహదారి



రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంప చెట్లు

ముదిగుబ్బ,జూన్ 2: మండలంలోని యోగివేమన జలాశయానికి వెళ్లే రహదారికి ఇరువైపులా ముళ్లకంపలు ఏపుగా పెరిగాయి. రోడ్డు కూడా పాతది కావడంతో కం కర తేలి, గుంతలు పడి ఉంది. ఇరువైపులా కం పచెట్లు పెద్దఎత్తున ఉండడంతో రోడ్డంగా మూసుకుపోతోంది. రాకపోకలు సాగించేవారు ముళ్లకంపలు తగులుతుండడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఎదురుగా మరో వాహనం వస్తే ఎటూ కదలలేని దుస్థితి నెలకొంటోంది. ఇక పొలాలకు వెళ్లే రైతులు నిత్యం అదేమార్గంలో వెళ్లాల్సి ఉంది. దీంతో వారు కూడా తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కంపచెట్లు తొలగించడంతో పాటు, రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

12 నుంచి పుస్తకాల పంపిణీ



ఎమ్మార్సీకి చేరిన పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 గోపాల్‌నాయక్

ధర్మవరం, జూన్ 2: పాఠశాలలు పునఃప్రారంభమయ్యాక పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తామని ఎంఈఓ-2 గోపాల్ నాయక్ తెలిపారు. పట్టణంలోని ఎమ్మార్సీకి చేరిన పుస్తకాలను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభమవుతాయన్నారు. ఇప్పటికి 1 నుంచి 7వ తరగతి వరకు 21వేల పాఠ్యపుస్తకాలు ఎమ్మార్సీకి వచ్చాయన్నారు. వీటిని ఆయా పాఠశాలలకు పంపుతామన్నారు. సోమవారం 8,9,10వ తరగతుల పుస్తకాలు రానున్నట్టు చెప్పారు. 2024-25 విద్యాసంవత్సరంలో సీబీఎస్ఈ సిలబస్‌కు పట్టణంలోని గుట్టకిందపల్లి మోడల్‌స్కూల్‌కు, మండలంలోని మోటుమర్ల వద్దగల కేజీబీవీకి అనుమతులు వచ్చినట్లు పేర్కొన్నారు.

లోతు దుక్కులతో భూమి సారవంతం

●పశువుల ఎరువు వేసి దుక్కి చేస్తే మరింత ప్రయోజనం ● రైతులకు వ్యవసాయాధికారుల సూచన



చిగిచెర్ల వద్ద పొలంలో ట్రాక్టర్‌తో దుక్కిదున్నుతున్న రైతు

ధర్మవరంరూరల్, జూన్2: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైతులు పొలాల్లో లోతు దుక్కులు చేసుకుంటే భూమి సారవంతమవుతుందని, దీంతో పంటలు బాగా పండుతాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. వేసవి వర్షాలకు దుక్కులు చేస్తే భూమి సారవంతమవడంతో పాటు కలుపుమొక్కలు, చీడపీడల నివారణ జరుగుతుందని చెబుతున్నారు. ఈ వర్షాలకు లోతుగా, ఏటవాలుగా దుక్కులు చేసుకోవడం వల్ల భూమి గుల్లగా మారి, భూమిలోని నీటి నిల్వ సామర్థ్యం పెరగడమే కాకుండా తేమలో జీవించే సూక్ష్మజీవులు, వానపాముల సంతతి వృద్ధి చెందుతాయంటున్నారు. మండలంలో గతేడాది 12,219 హెక్టార్ల వరకు వేరుశనగ, అంతరపంటలు సాగుచేశారు. ప్రస్తుతం పలు గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు చాలామంది రైతులు దుక్కులు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. మరికొంతమంది పొలాలకు ఎరువులు తోలుకుంటున్నారు. గత ఏడాది ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలను అధిక వర్షాలతో నష్టపోయిన రైతన్నలు రానున్న ఖరీఫ్ సీజన్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. దీంతో వేసవిదుక్కిలు దున్నుతున్నారు. కనీసం రెండుసార్లు అయినా భూమి దుక్కి దున్నుకుంటే పంటకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. దుక్కులు చేసేముందు రైతులు తమ పొలాలకు పశువుల పేడ, కంపోస్టు ఎరువులు, చెరువు మట్టి వేసుకుంటే భూసారం పెరిగి అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయాధికారులు తెలుపుతున్నారు.

దుక్కులు దున్నుతున్నాం..



వర్షాలు కురవడంతో పొలాల్లో ఖరీఫ్ సాగుకోసం దుక్కులు దున్నుతున్నాం. వేసవి వర్షాలకు దుక్కిదున్నకోవడంవల్ల చీడపరుగులు నశించి భూమి పంట ఎదుగుదలకు అనువుగా మారుతుంది. వర్షాలు కురుస్తుండటంతో ముందస్తుగానే సేద్యపు పనులకు సిద్ధమయ్యాం. ఇంకో పదును వర్షం కురిస్తే సేద్యపు పనులకు అనువుగా ఉంటుంది.

-చెలిమి అంజనేయులు, గరుడంపల్లి

దుక్కులతో భూమి సారవంతం



వేసవిలో వచ్చే తొలకరి వర్షాలకు రైతులు పొలాల్లో లోతుదుక్కులు చేసుకోవడం వల్ల తదుపరి వచ్చే వర్షాలకు ఆ దుక్కుల్లో నీరు నిల్వ ఉండి తేమశాతం పెరుగుతుంది. దుక్కులు లోతుగా దున్నితే భూమిలో ఉండే పురుగులు, వాటి గుడ్లు పంటనాశకాలు ఎండవేడిమికి నశిస్తాయి. మట్టినమునాల ఫలితాల మేరకు పంటలు సాగుచేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు. రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడకం పెంచుకోవాలి. దీంతో భూమి సారవంతంగా ఉంటుంది.

-ముస్తఫా, ఏఓ, ధర్మవరం

కూటమి గెలుపు ఖాయం: మాజీ మంత్రి పల్లె



టీడీపీ శ్రేణులతో మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి

నల్లమాడ, జూన్ 2: మండలకేంద్రంలోని స్వాతి క్లినిక్‌లో ఆదివారం మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పిచ్చాపాటిగా మాట్లాడారు. కూటమి గెలుపు ఖాయమన్నారు. చంద్రబాబు సీఎం అవుతారని, పుట్టపర్తి ఎమ్మెల్యేగా పల్లె సింధూరారెడ్డి విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులకు నిత్యం అండగా ఉంటామని ఈ సందర్భంగా పల్లె పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మైలే శివశంకర్, బుట్టి నాగభూషణ నాయుడు, మైలే రామచంద్ర, మంజునాథ్ రెడ్డి, హనుమంతరెడ్డి, పాపారాయుడు, రవికుమార్, శ్రీనివాసులు, గణేష్‌నాయక్, శివకుమార్, అభి తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయం తథ్యం

ధర్మవరం: కూటమి విజయం తథ్యమని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి బాలకృష్ణయాదవ్ ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శనివారం వచ్చిన ఎగ్జిట్ పోల్స్‌ఫలితాలు కూటమికే అనుకూలంగా వచ్చాయన్నారు. ధర్మవరంలో సత్యకుమార్‌యాదవ్ అత్యధిక మెజారిటీ గెలవబోతున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధి కూటమితోనే సాధ్యమన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ మరోసారి అధికారం చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జింకాచంద్రశేఖర్, నాయకులు సాకే ఓబులేశు, గుండాపుల్లయ్య, పుట్లూరు నరసింహులు, నాగభూషణ, నబీరసూల్, మల్లికార్జున, గంజి రాజ, మంజునాథ్, ప్రవీణ్‌క్రాంతి పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



గౌనిపల్లి ఉన్నత పాఠశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు



హార్సిలీహిల్స్‌లో కలిసిన గాండ్లపెంట పూర్వవిద్యార్థులు

ఓబుళదేవరచెరువు, జూన్ 2: మండలంలోని గౌనిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05వ విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. సుమారు 20 ఏళ్ల తర్వాత అందరూ ఒకచోట చేరి ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి గురువులు జయచంద్రారెడ్డి, భాగ్యలక్ష్మి, రామచంద్రారెడ్డి, సుబ్బిరెడ్డి, జయరాజు, బాబాఫకృద్దీన్, కృష్ణారెడ్డి, అంజనప్ప, ఫకృద్దీన్, బాబును శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

గాండ్లపెంట: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో 1982-83 వ విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 41 సంవత్సరాల తర్వాత అన్నమయ్య జిల్లాలోని హార్సిలీహిల్స్‌లో వారందరూ కలిశారు. ప్రతిఒక్కరూ ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు రమణ మ్మ, అరుణమ్మ, సుగుణమ్మ, శ్రీనివాసులు, రవీంద్రారెడ్డి, అన్వర్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

- పలు గ్రామాల పొలాల్లో ఒరిగిన విద్యుత్ స్తంభాలు
- అతి తక్కువ ఎత్తులో వేలాడుతున్న తీగలు
- ఎప్పుడు ఏమి జరుగుతుందోనని భయాందోళనల్లో రైతులు
- పట్టించుకోని అధికారులు



చిగిచెర్ల వద్ద విద్యుత్‌తీగలకు కర్రలు ఏర్పాటు చేసిన దృశ్యం



వసంతపురం వద్ద చేనులో చేతికందే ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ తీగలు

ధర్మవరంరూరల్, జూన్2: ఖరీఫ్ సీజన్ మొదలైంది. రైతులు సేద్యం పనుల కోసం పొలాలు బాటపడుతున్నారు. అయితే మండలంలోని పలు గ్రామాల్లోని పొలాల్లో విద్యుత్‌తీగలు అతి తక్కువ ఎత్తులో వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి.. చేతికందేఎత్తులో వేలాడుతూ యమపాశాలుగా మారాయి. దీంతో వాటి వల్ల ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని రైతులు నిత్యం భయాందోళనలకు గురవుతున్నారు. పలు గ్రామాల పొలాల్లో విద్యుత్‌స్తంభాలు ఒరిగి తీగలు కిందకు వేలాడుతున్నాయి. ముఖ్యంగా వసంతపురం గ్రామసమీపంలో ధర్మవరానికి వెళ్లే ప్రధానరహదారి పక్కన ఓ రైతు పొలంలో విద్యుత్‌తీగలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. చిగిచెర్ల గ్రామంలో శ్రీనివాసులు పొలంలోనూ అదే పరిస్థితి. అయితే ఆ రైతు కర్రల సాయంతో వాటిని కిందకు తగలకుండా తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. అయినా అవి ప్రమాదకరంగానే ఉన్నాయి. రాత్రిపూట పొలాల్లోకి వెళ్లాలంటేనే భయంగా ఉందని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. ట్రాక్టర్‌తో సేద్యపుపనులు చేయాలన్నా విద్యుత్ తీగలు ఎక్కడ తగులుతాయోనని నిత్యం ఆందోళన చెందుతున్నామని అంటున్నారు. ఆ తీగల వద్ద ఎవరైనా ఏమరుపాటుగా వ్యవహరిస్తే విద్యుత్ షాక్‌గు గురై మృత్యువాత పడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. గాలులు వీచినప్పుడు ఎక్కడ ప్రమాదానికి గురవుతామోనని పొలాల వైపు వెళ్లలేకపోతున్నామంటున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి స్తంభాలు పాతి వేలాడే విద్యుత్ తీగలను ఎత్తులో ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

అలరించిన చిన్నారుల నృత్యం

పుట్టపర్తి జూన్ 2: బాలవికాస్ చిన్నారులు చేపట్టిన సంగీత నృత్యం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. పట్టణంలోని ప్రశాంతినిలయంలో గల సాయికుల్వంత్ హాల్లో ఆదివారం తమిళనాడుకు చెందిన బాలవికాస్ విద్యార్థులు సత్యసాయి ప్రేమతత్వంపై నవవిధభక్తి పేరిట సంగీత నృత్యం ప్రదర్శించారు. అలాగే చిదంబరం బాలవికాస్ విద్యార్థులు ఐక్యతతో కూడిన ఆధ్యాత్మిక ప్రేమ పేరిట సంగీతనృత్యం ప్రదర్శించారు. పురాణాల్లోని పలు ఘట్టాలను ప్రదర్శించారు. సర్వమతాల్లోని ఐక్యతను తెలియజేసేదే భారతీయ సాంప్రదాయమని నృత్యరూపకం ద్వారా తెలిపారు. అనంతరం వారంతా సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. సత్యసాయి సేవాసంస్థల విల్లుపురం ప్రెసిడెంట్ శరవణన్, కడలూరు ప్రెసిడెంటు సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న బాలవికాస్ విద్యార్థులు



నృత్యరూపకంగా ఐక్యతను చాటుతూ..

129.0మి.మీల వర్షపాతం

ధర్మవరం, జూన్ 2: ధర్మవరం డివిజన్ పరిధిలో శనివారం రాత్రి 129.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి, ఏఎస్ఓ గోపాల్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. కనగానపల్లిలో అత్యధికంగా 54.2 మిమీల వర్షపాతం నమోదైందన్నారు.

జూలై 13 నుంచి ఏడు శనివారాల వ్రతం

ధర్మవరం, జూన్ 2: పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో గల లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో జూలై 13వతేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు ప్రతి శనివారం ఏడు శనివారాల వ్రతాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు చెన్నంశెట్టిజగదీశ్ ప్రసాద్, ప్రధానకార్యదర్శి జింకారాజేంద్రప్రసాద్, అర్చకుడు రాజేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల మహిళలు ఆలయంలో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వ్రతాన్ని ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించాలన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9440355720, 998524513, 9959706783ను సంప్రదించాలని సూచించారు.

కౌంటింగ్‌పై నేడు సమావేశం

పుట్టపర్తి రూరల్, జూన్ 2: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఓట్ల లెక్కింపుపై సమావేశం జరగనుందని,పుట్టపర్తి నియోజకవర్గ అభ్యర్థులు వారి ఏజెంట్లు హాజరుకావాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి భాగ్యరేఖ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఓట్ల లెక్కింపు మంగళవారం జరగనుందని, దీనిపై అభ్యర్థులకు వారి ఏజెంట్లకు తగు సూచనలు చేయనున్నట్లు చెప్పారు. సమావేశానికి ఆరు మండలాల తహసీల్దార్లు కూడా హాజరుకావాలని ఆర్ఓ సూచించారు.

మద్యం పట్టివేత

కదిరిఅర్బన్, జూన్ 2: మండలంలోని అల్లీపూర్ తండాలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యంను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తమకు అందిన సమాచారం మేరకు ఆదివారం సిబ్బందితో కలిసి అల్లీపూర్ తండాలోని మూడే గోపాల్‌నాయక్ ఇంటిలో సోదాలు చేశామని, అందులో అక్రమంగా నిల్వ ఉంచిన 98 క్వార్టర్ బాటిళ్లు లభ్యమవడంతో స్వాధీనం చేసుకున్నామని సీఐ మోహన్ తెలిపారు. అలాగే గోపాల్‌నాయక్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు. మద్యం, సారాను అక్రమంగా నిల్వ ఉంచినా, విక్రయించినా చర్యలు కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

సంయమనం పాటించాలి: సీఐ

నల్లమాడ, జూన్ 2: అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఓట్ల లెక్కింపునకు ముందురోజు, లెక్కింపురోజు, తరువాత రోజు సంయమనం పాటించాలని సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ సూచించారు. మండలకేంద్రంలోని సర్కిల్ క్యార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుందన్నారు. అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలన్నారు. ఎవరూ ఎలాంటి విజయోత్సవ సంబరాలు, ర్యాలీలు జరపకూడదన్నారు. అలా జరిపినవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఎన్నికల ఫలితాలపై జోరుగా బెట్టింగ్

గాండ్లపెంట, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై మండలంలో జోరుగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. గత మే13వ తేదీన జరిగిన ఓటింగ్‌లో భూత్‌లవారీగా ఏపార్టీకి ఎన్ని ఓట్లు పడ్డాయో బేరీజు వేసుకుంటూ గెలుపోటములపై జోరుగా పందేలు కాస్తున్నారు. ప్రధానంగా రెండు ప్రధాన పార్టీల మధ్య ఈ పందేలు జరుగుతున్నాయి. తామంటే తామే గెలుస్తామని ఎవరికివారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మండలంలో ఏనోట విన్నా.. ఫలితాలు, బెట్టింగ్‌ల మాటలే వినిపిస్తున్నాయి. 4వ తేదీ ఎప్పుడు వస్తుందా.. అని నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఓట్ల లెక్కింపులో విజయం ఎవరిని వరిస్తుందోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.

గాలివానకు కూలిన విద్యుత్ స్తంభం

పుట్టపర్తిరూరల్, జూన్ 2: కొత్తచెరువు మండలకేంద్రంలో శనివారం రాత్రి గాలితో కూడిన వర్షం కురిసింది. దీంతో ధర్మవరం ప్రధాన రహదారిలో 11కేవీ విద్యుత్‌స్తంభం కూలిపోయింది. దీనివల్ల కొత్తచెరువు మండలకేంద్రంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం నెలకొంది. ఆదివారం ఉదయం 7:30 గంటల వరకు కరెంట్ లేక ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డారు.



కూలిన విద్యుత్‌స్తంభాన్ని తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

నేడు లేపాక్షికి రానున్న గోవా మంత్రి



లేపాక్షి / హిందూపురం అర్బన్, జూన్ 2 : గోవా రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విశ్వజిత్ రాణే సోమవారం లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయాన్ని సందర్శించనున్నారు. ఆలయ సందర్శన కోసం ఆయన ప్రత్యేక హెలి కాప్టర్‌లో ఆదివారం హిందూపురం చేరుకున్నారు. పట్టణంలోని జీఆర్ లాడ్జిలో బసచేశారు. ఆయన సోమవారం దుర్గా, వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, యాగాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

840 మంది బైండోవర్

పెనుకొండ టౌన్, జూన్ 2: పెనుకొండ, సోమందేపల్లి మండలాల్లోని రౌడీషీటర్లు తదితర ఫ్యాక్షన్ నాయకులను ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో పోలీసులు బైండోవర్ చేశారు. వారంరోజుల నుంచి ఇప్పటి వరకు పెనుకొండ మండలంలో 400మంది, సోమందేపల్లిలో 440మందిని బైండోవర్ చేశారు. ఈ నెల 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ జరుగుతున్న సందర్భంగా ముందస్తు చర్యల్లో భాగంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బైండోవర్లు చేసినట్లు ఎస్‌ఐలు రాజేష్, విజయ్‌కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో కూలీకి గాయాలు

పెనుకొండ రూరల్, జూన్ 2: మండలపరిధిలోని సోలార్ కంపెనీ పక్కన జాతీయ రహదారి పక్కన ఆదివారం విజయ్‌కుమార్ అనే కూలీ విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డాడు. మండలపరిధిలోని కురవాండ్లపల్లి సర్పంచ్ నాగమూర్తి సోలార్ కంపెనీ సమీపంలో పాత జాతీయ రహదారి పక్కన తనకున్న పొలంలో భవన నిర్మాణం చేపడుతున్నారు. అదే గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ కూలి పనికి వెళ్లాడు. పనుల్లో భాగంగా ఇనుపరాడ్లు తీసుకొస్తుండగా ప్రమాదవశాత్తు సమీపంలో ఉన్న విద్యుత్ తీగలు వాటికి తగిలి విజయ్ కుమార్ విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డాడు. తోటి కూలీలు అతడిని పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం అతడిని అనంతపురం తరలించారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య

హిదూపురం అర్బన్ జూన్ 2: రెండు రోజుల క్రితం ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి సంపత్‌కుమార్‌ను హత్య చేసిన దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ అన్నారు. ఆయన ఆదివారం పట్టణపరిధిలోని ఆబాద్‌పేటలో ఉన్న సంపత్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంపత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేమయ్య మాట్లాడుతూ... వ్యక్తిగతంగా ఎదుర్కొనలేక ఇలా దారుణానికి ఒడి కట్టడం నీచమన్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సీపీఐ నాయకులు బాబు, చలపతి, జబీవుల్లా, రవికుమార్, సమీవుల్లా, కమల్‌బాష, జియా, అంజాద్ ఉన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం



అల్లాబకాష్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న గుండుమల తిప్పేస్వామి, నాయకులు

మడకశిరటౌన్, జూన్ 2: మండలకేంద్రమైన అమరాపురానికి చెందిన టీడీపీ మైనారిటీ నాయకుడు అల్లాబకాష్ మృతి పార్టీకి తీరనిలోటు అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. ఆయన ఆదివారం అనారోగ్యంతో మృతి చెందిన అల్లా బకాష్ ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, అధైర్యపడవద్దని ధైర్యం చెప్పారు. తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పార్టీ అభ్యున్నతికి కృషి చేశారన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, మాజీ ఎంపీపీ కృష్ణమూర్తి, మండల కన్వీనర్ గణేష్, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు జయకుమార్ ఉన్నారు.

ఓట్ల లెక్కింపులో బాధ్యతగా పనిచేయాలి

సిబ్బందికి ఎన్నికల పరిశీలకులు, కలెక్టర్ సూచన



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

హిందూపురం, జూన్ 2 : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా మంగళవారం జరిగే ఓట్ల లెక్కింపు సందర్భంగా అందులో పాల్గొనే ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎన్నికల పరిశీలకులు అన్బుకుమార్, దీపక్ రామ్‌చంద్ర తివారి పేర్కొన్నారు. వారు ఆదివారం స్థానిక బిట్ కళాశాలలలోని స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం బిట్ కళాశాలలో హిందూపురం, కదిరి, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల కౌంటింగ్‌పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకులు మాట్లాడుతూ.... ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో కౌంటింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి తమకు కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అజాగ్రత్తగా ఉండకూడదన్నారు. కౌంటింగ్‌కు వచ్చే ప్రతి ఒక్కరినీ గౌరవిస్తూ ఎన్నికల కౌంటింగ్ సజావుగా నిర్వహించేందుకు దోహదపడాలన్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా సిబ్బంది సమన్వయం పాటించాలన్నారు. ప్రతి రౌండ కీలక మని కచ్చితమైన వివరాలు నమోదు చేయాలన్నారు. ఎక్కడా పొరపాట్లకు తావివ్వ కుండా అభ్యర్థుల వారీగా ఏజెంట్లకు చూపించాలన్నారు. వారి నుంచి సంతకాలు తీసుకున్న తరువాతే ప్రకటించాలన్నారు. అంతేకాకుండా ఈవీఎం మిషన్లను తీసుకెళ్లేప్పుడు, ఓట్లు లెక్కించేటప్పుడు వాటిని జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సక్రమంగా, సజావుగా పూర్తి చేయడంలో మైక్రో అబ్జర్వర్ పాత్ర కీలకమన్నారు. జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ... మంగళవారం ఉదయం 6గంటలలోపే సిబ్బంది కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు ప్ర క్రియపై నిర్వహిస్తున్న శిక్షణపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎలాంటి సందేహాలున్నా ఆర్ఓ, ఏఆర్ఓలకు తెలిపి మీ అనుమానాలు నివృత్తి చేసుకోవాలన్నారు. విధుల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించ కూడదన్నారు. ఉదయం 8గంటలకు పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుందన్నారు. దీనికి సంబంధించిన వేర్వేరు టేబుళ్ల ఏర్పాటు చేశామని తెలిపారు. కౌంటింగ్‌కు వచ్చే అభ్యర్థులు, వారి ఏజెంట్లు సిబ్బందికి సహకరించాలన్నారు. కౌంటింగ్ కేంద్రానికి వచ్చేవారు కచ్చితంగా ఐడీ కార్డుతో హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, కౌంటింగ్ అబ్జర్వర్ స్నేహల్, నాయక్, గోల్కేకర్, ఆర్ఓలు వెంకటసాయిరెడ్డి, భాగ్యరేఖ, రెవెన్యూ సిబ్బంది పోలీసులు పాల్గొన్నారు.



బిట్ కళాలలోని కౌంటింగ్ హాలు



కౌంటింగ్ హాలుకు వేసిన కంచె

పలుచోట్ల భారీ వర్షం

నేలకొరిగిన మొక్కజొన్న పంట, కూలిన దేవాలయ ప్రహరీ



వెంకటగిరిపాళ్యంలో నేలకొరిగిన మొక్కజొన్న పంట

పెనుకొండ రూరల్, జూన్ 2 : పెనుకొండ మండలంలో శనివారం రాత్రి గాలి, వడంగళ్ల వాన బీభత్సం సృష్టించింది. గాలివానకు రైతులు సాగుచేసిన పంటలు నేలకొరిగాయి. మండలంలో శనివారం రాత్రి 9గంటల నుంచి 12గంటల వరకు విపరీతమైన గాలితో పాటు ఏకధాటిగా వర్షం కురిసింది. పలుచోట్ల వడగండ్లు పడ్డాయి. దీంతో మండలంలోని చిన్నపరెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించిన కొండమీద అంజనేయస్వామి ఆలయ ప్రహరీ కూలిపోయింది. దీంతో దాదాపుగా రూ.4లక్ష లు ఆస్తి నష్టం వాటిల్లిందని గ్రామస్థులు తెలిపారు. అలాగే వెంకటగిరి పాళ్యంలో వడగండ్లవానకు కౌలురైతు బోయ వెంకటరాముడు సాగుచేసిన మూడెకరాల మొక్కజొన్న పంట నేలకొరిగింది. మండల వ్యాప్తంగా శనివారం 9గంటల నుంచి గాలివానకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు.

ఉక్కపోత నుంచి ఉపశమనం

చిలమత్తూరు: మండల వ్యాప్తంగా శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో వారం రోజులుగా తీవ్ర ఉక్కపోతతో అల్లాడి పోతున్న ప్రజలకు కొంత ఉపశమనం కలిగినట్లయింది. మండలంలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం ఏకధాటిగా కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. విత్తనం వేసేందుకు అనుకూలంగా వర్షం కురవడంతో పొలాలను సిద్ధం చేసే పనుల్లో రైతులు బిజీ అయ్యారు. వారం రోజులుగా ఎండవేడిమి, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు వాతావరణం చల్లబడటంతో ఊపిరిపీల్చుకున్నారు. ఏది ఏమైనా నైరుతి రుతుపవనాలు రాక సందర్భంగా వరుణదేవుడు కరుణించడంపై సర్వత్రా ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



చిన్నపరెడ్డిపల్లిలో కూలిపోయిన ప్రహరీని పరిశీలిస్తున్న గ్రామస్థులు

మడకశిరలో ఓ మోస్తరు వర్షం

మడకశిరటౌన్: మడకశిర నియోజకవర్గం వ్యాప్తంగా శనివారం రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా రొళ్ల మండలంలో 10.4 మిల్లీమీటర్లు నమోదయింది. మడకశిర మండలంలో 9.2 మి.మీ. అమరాపురంలో 6.2 మి.మీ. గుడిబండలో 8.8 మి.మీ. అగళి మండలంలో 3 మి.మీ. వర్షపాతం నమోదయినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. వర్షం గత వారం నుంచి కురుస్తుండటంతో రైతన్నలు ఖరీఫ్ సాగు కోసం పొలాలను దుక్కి దున్నే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది ముందస్తుగా వర్షాలు కురుస్తుండటంతో అనేక మంది రైతులు పంటలు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం సకాలంలో సబ్సిడీ విత్తన వేరుశనగను అందించాలని కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెనుకొండ టౌన్, జూన్ 2: డిగ్రీ పూర్వ విద్యార్థుల (2001-2004 బ్యాచ్) కలయిక కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కళాశాలలో చదివి వివిధ ప్రాంతాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడినవారు కళాశాలలో అడుగు పెట్టగానే హోదాలు మరిచి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పుడు విధులు నిర్వహించిన అధ్యాపకులను ఆహ్వానించి వారి సేవలను స్మరించుకుని, సన్మా నించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జయప్ప, రిటైర్డ్ అధ్యాపకులు శంకరయ్య, సీతారామయ్య శాస్త్రి, హరీష్‌బాబు, రామన్న, అశ్వత్థప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



అప్పటి అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

కుక్కల దాడిలో 23 గొర్రెల మృతి

నంబులపూలకుంట, జూన్ 2: మండలంలోని సున్నంపుగుట్టతండాలో రవి నాయక్‌కు చెందిన 23 గొర్రెలు కుక్కలదాడిలో మృతి చెందాయి. బాధితుడు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. శనివారం మధ్యరాత్రి సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడిందని, ఉరుముల శబ్ధానికి మందలోని పలు గొర్రెలు బయటకు వచ్చాయన్నారు. గమనించిన ఊరి కుక్కలు హఠాత్తుగా వాటిపై దాడి చేసి చంపేశాయన్నారు. ఆ సమయంలో విద్యుత్ లేదని, దీంతో గొర్రెలను కాపాడుకోలేక పోయామని కంటతడిపెట్టారు. ఇటీవల కూడా 20 గొర్రెలు వ్యాధుల బారినపడి మృతిచెందాయన్నారు. రూ.6లక్షలు అప్పు చేసి 110 గొర్రెలను కొనుగోలు చేశానని, వీటిలో ఇప్పటికి 43కుపైగా చనిపోయాయని వాపోయారు. మొత్తంమీద రూ.3.5 లక్షల వరకు నష్టం జరిగిందని బాధపడ్డారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. విషయం తెలుసుకున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ ఆదివారం గ్రామానికెళ్లి బాధితుడిని పరామర్శించారు. ఘటనపై వివరాలడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.20వేలు ఆర్థికసాయం అందించారు. మరో పదిరోజుల తరువాత మరికొంత సాయం చేస్తామని హామీ ఇచ్చారు.

రైతులకు సాగు కష్టాలు

- కరువైన కాడెద్దులు... యంత్రాలపైనే ఆధారం
- పెరిగిన ట్రాక్టర్ బాడుగలు, కూలీల ధరలు
- ప్రకృతి వైపరీత్యాలతో చేతికందని పంటలు
- ఆర్థిక భారంతో తగ్గుతున్న సాగు విస్తీర్ణం



ట్రాక్టర్‌తో పొలంలో దుక్కులు చేయిస్తున్న దృశ్యం

మడకశిర, జూన్ 2: పెట్టుబడులు పెరుగుతుండడంతో ఏటా వ్యవసాయం భారంగా మారుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన మడకశిర నియోజకవర్గంలో రైతులు అధిక శాతం వ్యవసాయంపై ఆధార పడి జీవనం సాగిస్తున్నారు. ఈ ప్రాంతం ఎటువంటి సాగు నీటి వనరులు లేకపోవడంతో వర్షాధారిత పంటల సాగుపై ఆధారపడాల్సి వస్తోంది. అందులోనూ ఖరీఫ్‌లో సాగు చేసే వేరుశనగ పంటే ప్రధాన జీవనాధారం. ఇక్కడి రైతులు ప్రతి సంవత్సరం అప్పులు చేసి సాగు చేస్తున్న పంటలు ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బతింటు న్నాయి. కనీసం పెట్టుబడులు కూడా చేతికందడం లేదు. దీంతో అప్పులు ప్రతి ఏటా పెరుగుతూనే ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసిన అప్పులకు వడ్డీలు కట్టక పోవడంతో కొత్త అప్పులు పుట్టడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు. దీంతో పంటల సాగు విస్తీర్ణం యేడేడుకు తగ్గుతోంది. అలాగే వర్షాభావ పరిస్థితులతో పంటలు దెబ్బ తినడంతో గ్రాసం కొరత ప్రతి యేటా తీవ్రమవుతోంది. దీంతో కాడెద్దులను అతి తక్కువ ధరకు విక్రయించాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాడెద్దులు కరువడంతో వ్యవసాయానికి యంత్రాలపై ఆధారపడాల్సి వస్తోంది. పొలాలను దుక్కులు చేసేందుకు ట్రాక్టర్ బాడుగ గంటకు రూ.1000 చెల్లించాల్సి వస్తోంది. దీంతో సాగుకు పెట్టుబడులు పెరిగి పోతున్నాయని, కాడెద్దులు ఉన్నప్పుడు ఇంత ఖర్చు వచ్చేది కాదని రైతులు పేర్కొంటున్నారు.

తగ్గిపోతున్న సాగు విస్తీర్ణం

రెండు దశాబ్దాలుగా అతివృష్టి అనావృష్టి కారణంగా వేరుశనగ పంటలు దెబ్బతిని నష్టపోవడంతో రైతన్నలు అప్పుల ఊబిలో కూరుకుని పోయ్యారు ప్రతియేడు సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. సబ్సిడీ వేరుశనగ కోసం రైతన్నలు బారులు తీరేవారు, విత్తనం కోసం రోడ్ల పై బైఠాయించి ఆందోళనలు దిగేవారు. ప్రస్తుతం సబ్సిడీ విత్తనం కోసం అలాంటి సంఘటనలు ఏవీ చోటు చేసుకోవడం లేదు. కారణం సాగువిస్తీర్ణం సగానికి పైగా పడిపోయింది. గత 20సంవత్సరాలు క్రితం 60వేల హెక్టార్ల లో వేరుశనగ పంటను సాగు చేసేవారు. ప్రస్తుతం 28 వేల హెక్టార్లకు పడిపోయింది. ఐదు ఎకరాలలో సాగు చేసే రైతు రెండు, మూడు ఎకరాలు సాగు చేస్తున్నారు. కొంత మంది పంటలు పండవని గత ఐదు సంవత్సరాలు పొలాలను బీడుగా వదిలి వేశారు. ప్రతి యేడు పెట్టు బడులు పెరగడం, పంటలు దెబ్బతినడం కారణమని రైతున్నలు పేర్కొంటున్నారు.

పెరుగుతున్న కూలి

గత యేడు కంటే ఈ యేడు కూలీల కూలి, ట్రాక్టర్ల బాడుగలు బాగా పెరిగాయి. మహిళలకు రోజు కూలి రూ 250తో పాటు భోజనం, ఆటోలో వచ్చేందుకు అదనంగా రూ. 20 కలిపి మెత్తం రూ. 300 చొప్పున చెల్లించాల్సి వస్తోంది. పురుషులకు రూ.400 అవుతోంది. ఇంత ఆర్థిక భారం భరించలేక ఎక్కువ రోజులు కేటాయించి తామే పొలాల్లో కంప చెట్లు, పిచ్చిమొక్కలు తొలింగించడం వంటి పనులను చేసుకుంటున్నామని పలువురు రైతులు అంటున్నారు.



బీడుగా ఉన్న పొలం

'ఉపాధి'ని అనుసంధానం చేయాలి

కాడెద్దులు కరువై, పెరుగుతున్న పెట్టుబడులతో ప్రత్యామ్నాయ మార్గం లేకపోవ డంతో కష్టాల ఒడిలో ప్రతియేటా వ్యవసాయం సాగిస్తున్న రైతుల ఇబ్బందులు వర్ణాతీతం. కాడెద్దులు లేకపోవడంతో యంత్రాలపై ఆధారపడాల్సి వస్తోంది. అయితే డీజిల్ ధరలు పెరగడంతో ట్రాక్టర్ బాడుగలు బాగా పెరిగాయి. దీనికి తోడు కూలీల ధరలు పెరగి పంటల సాగు కష్టసాధ్యంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రాంభంలోనే వర్షాలు పడుతుండడంతో కొంత మంది రైతులు పంట సాగకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. మరి కొంత మంది ఆర్థిక ఇబ్బందులు కారణంగా నిస్తేజంగా నిలిచిపోయారు. ఈ పరిస్థితుల్లో మల్బరీ పంటకు వలెనే ఖరీఫ్‌లో వేరుశనగ సాగుకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దీంతో పెట్టుబడి భారం కొంత తగ్గుతుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేసున్నారు.

ట్రాక్టర్ బాడుగ గంటకు రూ.1000



ప్రతి యేటా వేరుశనగ సాగుకు పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు దెబ్బతిని పూర్తిగా నష్టపోతున్నాం. పంట సాగుకు ప్రతియేడు అప్పులు చేయాల్సి వస్తోంది. దీంతో అప్పులు రెట్టింపు అవుతున్నాయి. ఎకరాలో వేరుశనగ సాగుకు గత సంవత్సరం ఖరీఫ్‌లో రూ.20 వేల దాకా ఖర్చు వచ్చింది. ఈ యేడు మరింత మరింత పెరిగే అవకాశం ఉంది. మల్బరీ మంటకు ఉపాధిహామి పథకాన్ని అనుసం ధానం చేసినట్లే ఖరీఫ్‌లో వేరుశనగ పంటసాగుకు చేయాలి. దీంతో సగానికి పైగా పెట్టుబవి ఖర్చు తగ్గుతుంది. సాగు విస్తీర్ణం కూడా పెరుగుతుంది.

\- రవీంద్ర, రైతు, గొల్లపల్లి

ఏజెంట్లు జాగ్రత్తగా ఉండండి..

కౌంటింగ్‌లో సమన్వయం పాటించండి: టీడీపీ నాయకులు



సమావేశానికి హాజరైన టీడీపీ ఏజెంట్లు, నాయకులు

హిందూపురం, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజు మంగళవారం ఓట్ల లెక్కింపు కోసం వెళ్లే ఏజెంట్లు జాగ్రత్తలు పాటిస్తూ ... కౌంటింగ్ కేంద్రంలో సమన్వయంతో వ్యవహరించాలని టీడీపీ హిందూపురం ఎమ్మెల్యే అభ్యర్థి బాలకృష్ణ చీఫ్ ఏజెంట్ అనిల్‌కుమార్, టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. పురంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద ఆదివారం టీడీపీ తరుపున ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి వెళ్లే ఏజెంట్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... మంగళవారం ఉదయం 6గంటలలోపే కౌంటింగ్ కేంద్రాల వద్దకు చేరుకోవాలన్నారు. కౌంటింగ్ సందర్భంగా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు నడుచుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కౌంటింగ్‌కేంద్రంలో గొడవలు పడకూడదన్నారు. సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి రౌండుకు ఈవీఎంల వారీగా వచ్చే ఓట్లను రాసుకోవాలన్నారు. ఈవీఎం బాక్సుల లెక్కింపు ప్రారంభించే సమయంలో పోలింగ్ రోజు పోలైన ఓట్ల సంఖ్య ప్రస్తుతం ఉన్న సంఖ్యను సరి చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్, నాయకులు రంగారెడ్డి, జయప్ప పాల్గొన్నారు.

రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు



నారాయణమ్మ కాలనీ రోడ్డులో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పెనుకొండ రూరల్, జూన్ 2 : మండలంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు, పొంగి పొర్లాయి. పట్టణంలోని ప్రధాన రోడ్లపై వర్షపునీరు ప్రవహించింది. దీంతో దిగువ ప్రాంతాల్లోని రహదారుల్లో నీరు నిలువడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. పెనుకొండ-మడకశిర రహదారి నుంచి నారాయణమ్మ కాలనీ మీదుగా కోనాపురం, మంగాపురం, డిగ్రీ కళాశాలకు వెళ్లే దారిలో వర్షపునీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నారాయణమ్మ కాలనీ రోడ్డుకు మరమ్మతులు చేయాలని వైసీపీ హయాంలో ఐదేళ్ల నుంచి మునిసిపల్ అధికారులకు, పాలకులకు విన్నవించినా నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు వాపోయారు. ఇప్పటికైనా రానున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని నారాయణమ్మ కాలనీలో గుంతలమయంగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరారు. పెనుకొండ డివిజన్‌లో 43మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

కర్ణాటకలో నేడు ఎమ్మెల్సీ ఎన్నికలు



నారాయణస్వామి, బీజేపీ అభ్యర్థి



డీటీ శ్రీనివాస్, కాంగ్రెస్ అభ్యర్థి

పావగడ, జూన్ 2 : కర్ణాటక ఆగ్నేయ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం జరుగనున్నాయి. తుమకూరు, చిక్కబళ్లాపుర, కోలార్, చిత్రదుర్గం, దావరణగెర కలిపి ఐదు జిల్లాలకు సంబంధించి ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నియోజకవర్గానికి సంబధించి ఎన్నికల బరిలో కాంగ్రెస్ పార్టీ నుంచి డీటీ శ్రీనివాస్, బీజేపీ నుంచి వైఏ నారాయణస్వామి నిలిచారు. ఐదు జిల్లాలకు గాను 33,320మంది ఓటర్లు ఉన్నారు. ఈ స్థానానికి వైఏ నారాయణస్వామి నాలుగు సార్లు ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం బీజేపీ నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆయన బరిలో నిలువగా కాంగ్రెస్ నుంచి నూతన అభ్యర్థిగా డీటీ శ్రీనివాస్ నిలిచారు. గతంలో ఆయన ఇండిపెండెంట్‌గా పోటీచేసి ఓడిపోయారు. డీటీ శ్రీనివాస్ తన మామ మాజీ మంత్రి కిష్టప్ప, సతీమణి హిరియూరు మాజీ ఎమ్మెల్సీ సతీమణి పూర్ణిమ సహకారంతో కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నికల బరిలో దిగినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఈ ఎమ్మెల్సీ స్థానానికి సోమవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎన్నికలు జరుగనున్నాయి. ఓట్ల లెక్కింపు మంగళవారం చేపడుతారు. ఫలితాల కోసం ఒక రోజు వేచి చూడాల్సి ఉంది.

రెండో పెళ్లి చేసుకున్న వ్యక్తిపై కేసు

బెళుగుప్ప, జూన్ 2: తనకు తెలియకుండా రెండో పెళ్లి చేసుకున్న భర్త వన్నూరుస్వామిపై మొదటి భార్య శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. మండలంలోని విరుపాపల్లికి చెందిన వన్నూరుస్వామి పదేళ్ల క్రితం కాశీపురానికి చెందిన శైలజతో వివాహం కాగా వీరికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. ఇటీవల శ్రీరంగాపురానికి చెందిన మరో అమ్మాయి గీతను వన్నూరుస్వామి పెళ్లి చేసుకున్నాడు. కొద్దిరోజుల నుంచి కుటుంబానికి భర్త దూరంగా వుండటంతో ఆరా తీయగా మరో పెళ్లి చేసుకున్నట్లు బయటపడింది. పంచాయితీ చేస్తామన్న కుటుంబసభ్యులు పట్టించుకోలేదు. కట్టుకున్న భర్తలో కూడా మార్పు కనిపించకపోవడంతో న్యాయం జరగలేదన్న బాధతో శైలజ శనివారం ఫినాయిల్ తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. శైలజ ఫిర్యాదు మేరకు భర్తతో పాటు గీతమ్మలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అర్ధంతరంగా ఆగిన కమ్యూనిటీ భవన నిర్మాణం



కొంకల్లు ఎస్సీకాలనీలో ఆగిపోయిన కమ్యూనిటీ భవన నిర్మాణం

గుడిబండ, జూన్ 2: మండలంలోని కొంకల్లు గ్రామంలోని ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ భవన నిర్మాణం అర్ధంతరంగా ఆగిపోయింది. దాదాపు 15ఏళ్ల క్రితం ఎస్సీ కాలనీలో ప్రజల సౌకర్యార్థం కమ్యూనిటీ భవనం నిర్మాణం చేపట్టారు. గోడలు నిర్మించి స్లాబ్ కూడా వేశారు. కానీ ఆ భవన నిర్మాణాన్ని అర్ధంతరంగ నిలిపి వేశారు. వాకిళ్లు, కిటికీలు అమర్చలేదు. ప్లాస్టరింగ్ పని చేయ లేదు. అది పూర్తిచేయకపోవడంతో కాలనీ వాసులు సమావేశాలు నిర్వహించుకునేందుకు సరైన స్థలం లేక ఇబ్బందులుపడుతున్నారు. అధికారులు వెంటనే చొరవ తీసుకుని అర్ధాంతరంగా ఆగిపోయిన కమ్యూనిటీ భవనాన్ని పూర్తిచేయాలని వారు కోరుతున్నారు.